

మెదక్ చర్చిలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## శాంతికి ప్రతీక మెదక్ చర్చి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మెదక్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : శాంతికి ప్రతీక మెదక్ చర్చి అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. మెదక్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేశ్, ప్రెస్ బ్రీటర్ ఇన్‌చార్జి శాంతయ్య పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

**గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే జాజాల**



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం ఎల్లారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో వీరు బీఆర్‌ఎస్‌లో చేరగా.. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.

### సింగరేణి సీఎండీ డిప్యూటేషన్ పొడిగింపు



హైదరాబాద్, డిసెంబర్22 (నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం నాయక్ డిప్యూటేషన్‌ను మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆయననే పూర్తిస్థాయి సీఎండీగా నియమించే అవకాశం కూడా ఉన్నట్టు తెలుస్తున్నది.

### ప్రయాణికుల ఫిర్యాదులపై దృష్టి

**భద్రతా అంశాలపై రైల్వే అధికారుల సమీక్ష**

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రయాణికులు చేసే ఫిర్యాదుల పరిష్కారంపై రైల్వే అధికారులు దృష్టి సారించారు. రైళ్లలో ఏర్పాటు చేసిన కనీస సౌకర్యాలు, భద్రత వంటి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సమన్వయంతో నేరాలను తగ్గించే వ్యూహాలు, మెరుగైన రైల్వే భద్రత కోసం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ జోనల్ మేనేజర్లతో చర్చించారు. రానున్న రోజుల్లో రైల్వే భద్రత అంశాలపై కీలకంగా వ్యవహరించాలని ఆర్‌పీఎఫ్ అధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు జీఆర్‌పీ ఉన్నతాధికారుల 5వ అఖిల భారత సమావేశంలో ఈ అంశాలపైనా చర్చించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

# సిరులవేణి.. సింగరేణి!

- 104 ఏండ్ల సుధీర్ఘ ప్రస్తానం
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం
- సంస్థను వెంటాడుతున్న సమస్యల సవాళ్లు



హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బొగ్గు పేరెత్తగానే సింగరేణియే గుర్తుకొస్తుంది. నల్లబంగారానికి సింగరేణి పర్యాయపదమైంది. అంతలా ప్రసిద్ధి పొందిన సింగరేణి.. ఆవిర్భవించి నేటికి 104 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సింగరేణి వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం పాల్గొననున్నారు. బొగ్గు వెలికితీతే ప్రధాన బాధ్యతగా ఆవిర్భవించిన సింగరేణి వ్యాపార విస్తరణ, తదితర అనేక రంగాల్లోనూ పయనిస్తున్నది. కొత్త గనులనూ చేపట్టనున్నది. ఒడిశా నైనీ కోల్‌బ్లాక్, కొత్తగూడెంలో వీకే ఓసీ, ఇల్లందులో రొంపేడు ఓసీ, గోలేటి ఓసీల్లో ఉత్పత్తిని ప్రారంభించనున్నది. కొత్తగూడెంలో వెంకటేశ్ ఖని, ఇల్లందులో జవహర్‌ఖని గనులకు అనుమతులు పొందింది. రామగుండంలో 500 మోగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనున్నది. ఇటీవలే కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి సంకల్పించింది.

**ఇతర ఖనిజ తవ్వకాలపైనా గురి**

లిథియం సహా ఇతర ఖనిజాల తవ్వకాలపైనా సింగరేణి దృష్టిపెట్టింది. జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియం నైట్రేట్ తయారీకి చర్యలు చేపట్టింది. టీజీ జెన్‌కోతో కలిసి రామగుండంలో కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మించనున్నది. రాజస్థాన్‌లో సోలార్ ప్లాంట్‌ను నిర్మించనుంది. ఇంతటి ఘనకీర్తిని కలిగిన సింగరేణిని పలు సమస్యలు వెన్నాడుతున్నాయి.

**సమస్యలు.. సవాళ్లు!**

- సింగరేణిలో మొత్తం 40 గనులుంటే 22 భూగర్భ గణులే. వీటిలో ఉత్పాదక వ్యయం అధికం కావడంతో ఏటా రూ.3 వేలకోట్లు నష్టాలొస్తున్నాయి.
- కొత్తగా ఉత్పత్తి ప్రారంభించాల్సిన గనులకు కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ నుంచి సకాలంలో అనుమతులు రావడం లేదు. ఈ కారణంతోనే నైనీ కోల్‌బ్లాక్ నాలుగేండ్లుగా ముందుకుసాగడం లేదు.
- ఉత్పత్తి నిరుడు 72 మిలియన్ టన్నులు ఉండగా, ఈ ఏడాది 74 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నది. ఆర్థిక సంవత్సరానికి ఇంకా 100 రోజులే గడువు ఉండగా, రోజుకు 2.7 లక్షల టన్నుల బొగ్గును వెలికి తీస్తేనే లక్ష్యం పూర్తవుతుంది.
- కార్మికుల గైర్హాజరు, పనిగంటలు సైతం బొగ్గు ఉత్పత్తి, సంస్థ ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయి. 2024 జనవరి నుంచి అక్టోబర్ వరకు 300 రోజుల్లో 75 రోజులు కూడా పనిచేయని కార్మికుల సంఖ్య 1,892గా తేలింది. పలువురు కార్మిక సంఘాల నేతలు డుమ్మాలు కొడుతున్నారు.
- యంత్రాల వినియోగంలోనూ చెప్పుకోదగిన పురోగతి లేదు. యంత్రాలను 18 గంటలు నడపాలని సంస్థ వర్గాలు పదే పదే ఆదేశాలిస్తున్నాయి.
- బొగ్గు గనుల్లో ప్రమాదాలు, కార్మికుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటా పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.
- కారుణ్య నియామకాల్లో అక్రమాలు సంస్థకు మాయనిమచ్చను తెచ్చిపెట్టాయి. ఈ అక్రమాలపై సీఐడీ విచారణ జరిపింది.
- వర్షాలు, వరదలు సైతం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. భారీ వర్షాలతో ఓపెన్‌కాస్టుల్లో నీరు చేరుతున్నది. ఈ నీటి తొలగింపు పెద్ద సమస్యగా మారుతున్నది.

## నిందితులపై వేధింపులు మానుకోవాలి

**మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ బృందం సభ్యులు**



వివరాలు తెలుసుకుంటున్న మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ బృందం సభ్యులు

మందమర్రి, డిసెంబర్ 22: నేరస్తుల్లో మార్పు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం, పోలీసులు కృషి చేయాలని, అంతేగాని వారిని వేధించవద్దని మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ బృందం సభ్యులు అన్నారు. ఈ నెల 19న మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని చెంచుకాలనీ, విద్యానగర్, యాపల్ ఏరియాలకు చెందిన నలుగురు యువకులు తమను పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ సెల్ఫీ వీడియో తీసుకుని సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన విషయం తెలిసిందే. ఆదివారం బాధితుల ఇండ్లకు వచ్చిన మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ బృందం సభ్యులు వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రఘోత్తం రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు రంజిత్ కుమార్ మాట్లాడుతూ కేకే1 గని దొంగతనం ఘటనపై సెక్యూరిటీ అధికారి ఇచ్చిన ఫిర్యాదులో నలుగురు యువకుల పేర్లు లేవన్నారు. అయినప్పటికీ పోలీసులు తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారని, స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉన్నా వారిని ఒప్పించి రిమాండ్‌కు తరలించారని తెలిపారు. విద్యానగర్ యువ సేన అనే సంస్థను స్థాపించి సేవలు అందిస్తున్న వారిని జైలుకు పంపించడం సరికాదన్నారు. వారానికి రెండు రోజులు పోలీస్ స్టేషన్‌కు రావాలనే నిబంధనను రద్దు చేయాలన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులను కోరారు.

# మూల మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు

- డబుల్ రోడ్డు నిర్మాణానికి నోచుకోని ఘాట్ ప్రాంతం
- తరుచూ అంతరాయాలతో ఇబ్బందికర ప్రయాణం



ప్రమాదకర మూలమలుపు వద్ద నిలిచిన వాహనం

కెరమెరి, డిసెంబర్ 22 : మూల మలుపులు.. చూసేందుకు ఎంత అందంగా కనిపిస్తున్నాయో ప్రమాదాలు సైతం అదే స్థాయిలో నమోదవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోనే ఘాట్ మూల మలుపులకు కెరమెరి నిలయంగా మారింది. ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే రహదారిలో కెరమెరి దాటగానే ఘాట్‌లు దర్శనమిస్తాయి. ఈ రోడ్డుపై నిత్యం ఎన్నో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయినా ఈ ప్రాంతంలో డబుల్ రోడ్డు నిర్మించకపోవడం శోచనీయం. అటవీ శాఖ అనుమతులు లేవనే కారణం నిర్మాణ పనులకు అడ్డంకిగా మారింది. ప్రతి రోజూ చిన్న వాహనాల నుంచి అనుమతి లేని పెద్ద వాహనాలు రాకపోకలు కొనసాగిస్తూ ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నాయి. ఒక్కోసారి ఏదైనా వాహనం అంతరాయం ఏర్పడి పక్కనే నిలిచిపోవడంతో ఇతర వాహనాలకు మరింత ఇబ్బందికరంగా మారుతున్నది. మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు ఇదే రహదారిపై ప్రయాణం చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నా శాశ్వత పరిష్కారం చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సైడ్ ఇవ్వాలంటే రోడ్డు దిగాల్సిందే



ఇటు బస్సు అటూ లారి సైడ్ కోసం ఎదురు చూపులు

## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ



సభ్యుడిని సన్మానిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 22 : ఎమ్మార్పీఎస్ నస్పూర్ అంబేద్కర్‌కాలనీ నూతన కమిటీని ఆదివారం మండల ఇన్‌చార్జిలు గద్దల బానయ్య, చుంచు శంకర్‌వర్మ, సీనియర్ నాయకుడు అట్కపురం రాయమల్లు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సలహాదారులుగా కొప్పర్తి రాజయ్య, అధ్యక్షులుగా మాడుగుల మహేశ్, ఉపాధ్యక్షులుగా కొయ్యాల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా కొప్పర్తి శ్రావణ్, సలహాదారులుగా కొప్పర్తి సురేందర్, మాడుగుల కిరణ్, ప్రచార కార్యదర్శిగా చిట్యాల ప్రశాంత్, కార్యవర్గసభ్యులుగా ఇరికిళ్ల అక్షయ్, కొయ్యాల లింగయ్య, కొప్పర్తి రవీందర్, అయిల్ల కుమార్, కొప్పర్తి వెంకటేశ్, మాడుగుల చంద్రశేఖర్, ఈదుకోని వంశీ, శాతరాజు సిన్ను ఎన్నికయ్యారు. సభ్యులు ఎమ్మార్పీఎస్ అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.

## బాల్య మిత్రుడికి బాసటగా



మాట్లాడుతున్న సమన్వయకర్త

దండేపల్లి, డిసెంబర్ 22 : దండేపల్లి మండలంలోని మామిడిపెల్లి గ్రామానికి చెందిన కాగిత గోపాల్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో 1998–99 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య మిత్రులు గోపాల్ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.15 వేలు అందించారు. భవిష్యత్‌లో కూడా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులున్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి, డిసెంబర్ 22 : ప్రభుత్వ సెలవు దినాల్లో నిర్వహించే ఓపెన్ తరగతులకు అభ్యాసకులు హాజరై, భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని దండేపల్లి ఉన్నత పాఠశాల సమన్వయకర్త సంఘర్స్ రాజేశ్వర్‌రావు, తెలుగు పాఠ్య పుస్తకం రచయిత కొండు జనార్దన్ పేర్కొన్నారు. దండేపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల అధ్యాయన కేంద్రంలో ఆదివారం వారు మాట్లాడారు. ఏప్రిల్‌లో జరిగే పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం రామ్మోహన్, కొండు రామన్న, అభ్యాసకులు పాల్గొన్నారు.

## బాలసాహిత్యంపై దృష్టిపెట్టాలి



సంగనబట్ల చినరామాకిష్టయ్యను సన్మానిస్తున్న కవులు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 33 : బాల సాహిత్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని విశ్రాంత తెలుగు పండితుడు, కథా రచయిత, గాయకుడు సంగనబట్ల చినరామకిష్టయ్య సూచించారు. జిల్లా సాహితీ సంరక్షణ సమితి అధ్యక్షుడు దండనాయకుల వామన్ రావు అధ్యక్షతన స్థానిక సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం బాలసాహిత్యంపై ప్రసంగ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం బాల సాహిత్య అవశ్యకత ఎంతో ఉందని చినరామాకిష్టయ్య పేర్కొన్నారు. సూమారు 720 కథలు, 100 లలిత గీతాలు, రెండు శతకాలు రాస్తూ తన సాహితీ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనేక లలితా గీతాలు ఆలపిస్తూ మధుర గాయకుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నట్లు చెప్పారు. కవులు ముత్యబోయిన మలయశ్రీ, దుర్గం రామేశం గౌడ్, వెంకట్రాయ శర్మ, నోముల చంద్రశేఖర్, బెల్లాల సుగుణాకర్, బ్రహ్మయ్యాచారి, ఘనపురం సంతోష్, భూపతి సంతోష్, మల్యాల మురళీ కృష్ణ, దాసరి శ్రీనాథ్ గౌడ్, మేసు మల్లేశం పాల్గొన్నారు.



జ్ఞాపిక, బహుమతులు అందజేస్తున్న ఏసీపీ రవికుమార్

## ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

తాండూర్ (బెల్లంపల్లి), డిసెంబర్ 22 : బెల్లంపల్లి పట్టణంలోని నంబర్ టూ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన సబ్ డివిజన్ పోలీసుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని 4 పోలీస్ జట్లు పాల్గొన్నాయి. బెల్లంపల్లి రూరల్ లెజెండ్, తాండూర్ పాంతర్ జట్లు ఫైనల్ చేరుకోగా, మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తాండూర్ పాంథర్స్ జట్టు గెలుపొందగా, బెల్లంపల్లి రూరల్ లెజెండ్ రన్నర్‌గా నిలిచింది. ఏసీపీ రవికుమార్ జ్ఞాపిక, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు అఫ్జలుద్దీన్, దేవయ్య, కుమారస్వామి, శశిధర్‌రెడ్డితో పాటు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ధారావత్ ప్రేమ్ చంద్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్



ర్యాలీగా భీమారం చేరుకున్న నాయకులు

భీమారం, డిసెంబర్ 22 : ప్రభుత్వ పాలకులు గిరజనులకు గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, జానాభా దామాషా ప్రకారం గిరిజనులకు 4 ఎంఎల్‌సీలు, రెండు రాజ్యసభ సీట్లు కేటాయించాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ధారావత్ ప్రేమ్ చంద్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్ డిమాండ్ చేశారు. భద్రాద్రి గొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం సంత్ శ్రీ సద్గురు సేవాలాల్ మహరాజ్ దేవాలయం సేవా ఘడ్ నుంచి 8న ప్రజా రగ్ జోళ యాత్ర ప్రారంభమవగా, ఆదివారం భీమారం చేరుకున్నది. వారికి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేశ్ నాయక్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు పంతుల నాయక్, సేవాలాల్ సేన నాయకులు జర్పుల రాజ్‌కుమార్ నాయక్, ధరావత్ సుధాకర్ నాయక్, స్థానిక తండవాసులు తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

## అ'పూర్వ' సమ్మేళనం

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 22: సీసీసీ నస్పూర్‌లోని నర్సయ్య భవన్‌లో నిర్వహించిన శ్రీసాయి కళాశాలకు చెందిన ఇంటర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా.. ఉల్లాసంగా జరిగింది. కళాశాలలో 2005–2007 సంవత్సరంలో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులంతా ఆదివారం సమావేశమై ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కర్ణ శ్రీధర్, ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి, అధ్యాపకులు రాజేశ్వర్‌రెడ్డి, నర్సయ్య, చిరు, మల్లారెడ్డి, కుమార్, సత్యనారాయణ, అశోక్, ఆంజనేయులు, శరత్, శ్రీనివాస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై పోరాటం

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 22 : విద్యారంగ సమస్యలపై టీఎస్ యూటీఎఫ్ పోరాటం చేస్తున్నదని జిల్లా కార్యదర్శి హేమంత్ షిండే అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభల పోస్టర్లను ఆదివారం ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వైజ్ఞానిక సభలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు, 317 జీవో , పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీపై చర్చించడంతో పాటు, వాటిని సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. కోశాధికారి రమేశ్, నాయకులు నవీన్, కుమార్, రవికుమార్, జాదవ్ సుభాష్, సంతోష్, సమ్మయ్య, చొక్కా రావు, నగేశ్, అజయ్, రవి, శివాజీ, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



నిర్మల్ చైన్‌గేట్ : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 22: నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్‌లో అంబేద్కర్ యు వజన సంఘం ఆధ్వర్యంలో కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను చేసిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల రంజిత్, దేవ రవికుమార్, దర్శనం సాయన్న, పొట్ట నవీన్, దేవ చిన్ని, దేవ రవీందర్, పొట్ట రాజేశ్వర్, దేవ సాయన్న, దర్శనం ముత్యం, మైల రాజు, కొంతమ్ ఆడెళ్లు, పొట్ట ప్రవీణ్, పులి అశోక్, తదితరులున్నారు.

**దేశ ప్రజందరికీ క్షమాపణ చెప్పాలి**

ఎదులాపురం, డిసెంబర్ 22 : కేంద్ర మంత్రి అమిత్ షా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని దళిత సంఘం నాయకులు ప్రజ్ఞశీల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం మంత్రి స్థాయికి దిగజారి బాబా సాహెబ్‌పై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు గైక్వాడ్ భారత్, మానే సంతోష్, శోభతాయి పాల్గొన్నారు.